# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా దసరా ఉత్సవాలకు విజయవాడ ప్రసిద్ధి చెందేలా "విజయవాడ ఉత్సవ్" జరిగిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిషాలోని గోపాలపూర్ వద్ద తీరం దాటింది.**

3. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది.**

4. **హైదరాబాద్ లోని పాతబస్తీలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన రోడ్డు వంతెనను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు.**

==========================

దేశవ్యాప్తంగా దసరా ఉత్సవాలకు విజయవాడ ప్రసిద్ధి చెందేలా "విజయవాడ ఉత్సవ్" నిర్వహించడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడ ఉత్సవ్ లో భాగంగా గొల్లపూడిలోని వాణిజ్య మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను గత రాత్రి ముఖ్యమంత్రి సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్..26 సెకన్లు

కాగా అంతకుముందు విజయవాడలోని ఇందిరగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు వేలమంది కళాకారులతో నిర్వహించిన దసరా కార్నివాల్‌లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్నివాల్‌లో 3 వేల మంది కళాకారులతో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు నిర్వహించారు. కార్నివాల్‌లో చేపట్టిన డప్పు ర్యాలీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నెలకొల్పిందని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ జరగనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జిఎస్టీ సడలింపులపై అవగాహనా కార్యక్రమాలు, ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటితో

పాటు రాజధాని అమరావతి నిర్మాణాల పురోగతి, విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ –2025 పైనా మంత్రి వర్గం చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 4 కేంద్రీయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఒక వీడియో సందేశం ద్వారా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గుంటూరు, చిత్తూరు, కుప్పంలతో పాటు పలాసలో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. పలాసకు కేంద్రీయ విద్యాలయం కేటాయింపు ద్వారా శ్రీకాకుళం జిల్లా వాసుల కల సాకారం కానుందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

హైదరాబాద్‌లోని పాతబస్తీ ఫలక్ నుమా ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన రోడ్డు వంతెన–ఆర్.ఓ.బిను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు. 5 కోట్ల రూపాయలతో 4 వరుసల్లో హైదరాబాద్ మహానగర పాలక సంస్థ–జీహెచ్ఎంసీ ఈ ఆర్.ఓ.బిని నిర్మించింది. పాత ఆర్.ఓ.బిని పునరుద్దరించడంతో పాటు దానికి సమాంతరంగా మరో ఆర్.ఓ.బిని నిర్మించడంతో.. బార్కస్ జంక్షన్ నుంచి ఫలక్నుమా బస్ డిపో, రైల్వే స్టేషన్, చార్మినార్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబరు నెలకు సంబంధించి 2 వేల 789 కోట్ల రూపాయల వస్తు సేవల పన్ను–జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఈ సెప్టెంబరులో స్థూల జీఎస్టీ వసూళ్లలోనూ 4.19 శాతం వృద్ధి సాధించినట్లు వెల్లడించింది. రాష్ట్ర జీఎస్టీ –ఎస్‌జిఎస్‌టి రాబడిలోనూ 8.28 శాతం వృద్ధి నమోదు అయిందని తెలిపింది. పన్ను వసూలులో కృత్రిమ మేథ, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ –ఐటిసి వంటి విధానాలను అమలు చేస్తున్నామని వాణిజ్య పన్నుల శాఖ పేర్కొంది.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిషాలోని గోపాలపూర్ వద్ద తీరం దాటిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా జిల్లాల్లో రాగల 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ,

వాయిస్.. 23 సెకన్లు

అలాగే తీరం వెంబడి బలమైన గాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు మూడు రోజుల పాటు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. కోస్తా తీరం వెంబడి ఉన్న అన్ని పోర్టులకు 3వ నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేసింది.

మరోవైపు తెలంగాణలోనూ రాగల 24 గంటల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

వాయగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో వర్షాలు, ఈదురుగాలులు, ఆకస్మిక వరదలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమ విధానంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాలకు ఆకస్మిక వరదలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా గత సాయంత్రం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. పండితులు యాగశాలలో అమ్మవారి పూర్ణాహుతి... కలశ ఉద్వాసన ఇతర వైదిక కార్యక్రమాలను నిర్వహించడంతో ఉత్సవాలు పరిసమాప్తం అయ్యాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, పాల్గొన్నారు. దసరా ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 31 సెకన్లు

మరోవైపు దసరా ఉత్సవాలు ముగిసినప్పటికీ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.

---------------------------

దసరా పండుగ సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో ప్రయాణికులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో హైదరాబాద్ నుంచి మంత్రి నిన్న శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సెలవులు ముగియగానే ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకుంటారని, వారికి ఇబ్బందులు కలగకుండా ప్రతి బస్ స్టేషన్‌లోనూ ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

---------------------------

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ క్రికెట్ సిరీస్ నిన్న ప్రారంభమయ్యింది. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 44 ఓవర్లలో 162 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన భారత్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 121 పరుగులను చేసింది.

=====================